# విపంచి అంతేకావాలి

"మీరు దేవుడు!"

అందమైన పూలతీగ ప్రాణం పోసుకొన్నట్లు, నాజూకైన శరీరంతో నిలబడివుందామె.

"ఎంతటి గొప్పవాళ్ళైనా... వళ్ళమ్ముకొనే వేశ్యని పెళ్ళాడడానికి ముందుకురారు. అలాంటిది... మీరు రావటం... నిజంగా నా అదృష్టం" చెప్పింది రాధ.

ఆ మాట అంటున్నప్పుడు చాలా కాలం తర్వాత ఆమె కళ్ళు సన్నటి నీటిపొరని చాటుచేసుకున్నాయి.

అది వారిద్దరికి మొదటి (?) రాత్రి!

చిదంబరం కళ్ళు ఎర్రబడ్డాయి- కోరికతో. కసిగా నవ్వుతూ, ఆమెని మీదికి లాక్కున్నాడు.

*　　*　　*

రాధకి తను ఎప్పుడు వేశ్యా వృత్తిలోకి అడుగుపెట్టిందో గుర్తు లేదు.

ఆమెకి తెలిసేసరికి, ఆమె శరీరంమీద మోజుపడేవాళ్ళు కొన్ని పదులమంది వున్నారు.

చాలాసార్లు వంటరిగావున్నప్పుడు కిటికీలోనుండి వినీలాకాశాధిపత్యం వహించే వెన్నెల్లోని హాయిని అనుభవిస్తున్నప్పుడు అనుకునేది- "తనకి శాశ్వతంగా ఓ తోడు దొరకాలని".

అనుకొన్న కొద్దికాలానికే ఆమె కోరిక నెరవేరింది. 'వేశ్యోద్ధారణ' కోసం కంకణం కట్టుకున్న ఓ మహానుభావుడు, వారికి వివాహాలు జరిపించదల్చుకున్నాడు.

వేశ్యలని వివాహమాడటానికి ముందుకొచ్చిన వాళ్ళల్లో చిదంబరం ఒకడు.

అతడు పెద్దప్రయివేటు ఫర్మ్‌లో చిన్న ఉద్యోగి మాత్రమే. అందలం ఎక్కాలని, అందాల పొందు పొందాలని ఆశపడటం అతని హాబీ. అందంగావుండే రాధ అతని అర్ధాంగి అయ్యింది.

## 2

రాధకి, చిదంబరానికి మధ్య దాంపత్యబంధం ఏర్పడి, ఆ నాటికి ఇరవై రెండో రోజు—

అసలలాంటి సంఘటనే తను జీవితంలో ఎదుర్కోవాలని ఏమాత్రం వూహించని రాధ చిదంబరం చెప్పిన దానికి నిశ్చేష్టురాలయ్యింది.

నవ్వాడు చిదంబరం. ఎప్పుడూ నవ్వే నవ్వే అది. కాని ఈసారి ఆ నవ్వులో కొత్త అర్థం ధ్వనిస్తూంది.

"ఏమిటేముంది? నీకు బాగా అలవాటైందే! కాకపోతే ఈ కాసిన్ని రోజుల్లో అలవాటు తప్పినట్టుంది. అయినా ఫర్లేదు. మా ప్రొప్రయిటర్ పరమోత్తమరావ్‌కి ఆడపిచ్చి ఎక్కువ. అందులో అందమైన ఆడవాళ్ళంటే మరీనూ.

ఆడ పొందుకోసం ఏదైనా చేస్తాడు. నాకు వుద్యోగంలో ప్రమోషన్ కావాలి. అది అతడికే సాధ్యం. నీకు తెలుసుగా నా జీతం అతి తక్కువ మాత్రమేనని.

ఎన్నాళ్ళిలా బ్రతుకుతాం గొర్రె తోక బెత్తెడే అన్నట్టు! అందుకే నీ సహాయం కావలసి వచ్చింది.

జస్ట్... మా బాస్ 'సరదా' తీర్చాలి. అది నీకేమాత్రం అసాధ్యం కాదని నాకు బాగాతెలుసు. అనుభవమున్నదానివి! నీ 'స్పెషల్ టెక్నిక్కు'లతో మా బాస్‌ని వశపర్చుకోవాలి. ఆ విషయంలో నాకు బాగా నమ్మకముంది" చెప్పటం ముగించాడు చిదంబరం.

"ఛీ...!" ఛీత్కారం చేసింది రాధ. తాళి కట్టించుకున్న తర్వాత మొగుడి నీడలో పాత జీవితాన్ని, అన్నింటిని మర్చిపోవాలని ఆశించింది.

దేనినైతే మర్చిపోవాలనుకుంటుందో, మళ్ళీ ఆ బురదలోకే...

పకపకా నవ్వాడు చిదంబరం. "ఛీ ఏమిటే?..." బూతుమాట తిట్టాడు.

అడుగు ముందుకేస్తూ, నోట్లో ఎర్రగా కాల్తున్న సిగరెట్ తీసి, చేతి వేళ్ళమధ్య పట్టుకొన్నాడు.

రాధని సమీపించాడు. "నీ ఎర్రని బుగ్గలపై మరింత ఎర్రగా—" ఎర్రటి సిగరెట్ కొన రాధ కపోలాలపై మచ్చలు సృష్టించింది.

"అమ్మా!" కళ్ళల్లో నీరు గిర్రున తిరిగి, కనురెప్పల ఖాళీలగుండా బుగ్గలమీదికి జారింది. అప్పుడేకాల్చబడ్డ బుగ్గలు భగ్గుమని మండినట్లనిపించింది రాధకి.

"బాగుందా కొత్తరకం ముద్దు" తీక్షణంగా రాధకేసి చూస్తూ అన్నాడు చిదంబరం. "ఇంకా నా జేబులో అరడజనుకి తక్కువ కాకుండా సిగరెట్లున్నాయి, అగ్గిపెట్టెతోసహా.

నీ గోధుమరంగులోని ఆ నును పైన మెడమీద, లేత అరచేతుల మీద, నీ గుండెలమీద, వీపుమీద, నుదురుమీద...నీ శరీరంలో అణువణువుని అంటించగలను నేను."

"నిన్ను పతితోద్ధారణకై పాటుపడ్డ మంచివాడనుకొన్నందుకు సిగ్గుపడుతున్నాను."

రాధ మాటలకి రెచ్చిపోయాడు చిదంబరం. "ప్రమోషన్‌కి, పనులు జరిపించుకోవటానికి, అవసరాలు తీర్చుకోవటానికి పనికొస్తావని తప్పిస్తే, నిన్ను నేనెందుకు చేసుకుంటానే?

అంతమాత్రాన నీకేదో అన్యాయం చేస్తానని భయపడకు! నిన్ను నాదగ్గరే వుంచుకుంటా- నా పనులు మారుమాట్లాడకుండా చేసినప్పుడు, నా ముద్దులు చెల్లించినప్పుడు. ఆలోచించుకో!" చెప్పాడు చిదంబరం.

అరక్షణం ఆలోచించింది రాధ "నేను రెడీ!"

ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు చిదంబరం.

*　　*　　*

ఆనందంతో వుక్కిరిబిక్కిరయ్యాడు పరమోత్తమరావ్ తన ఎదురుగావున్న రాధనిచూసి.

"మహాబాగున్నావే!" పొగడ్తగా నవ్వాడు. "ఈ మధ్యకాలంలో నీలాంటిదాన్ని చూడలేదంటేనమ్ము!"

బదులుగా, అందంగా నవ్వింది రాధ.

"అదిగో ఆ నవ్వే" పరమోత్తమరావ్ నోట్లోని బంగారపుపన్ను బయటికి కన్పించింది. "చిదంబరం యింత మంచి పిల్లని పంపిస్తాడనుకోలేదే" మళ్ళీ తనే అన్నాడు.

"హూ! ఎంత మంచిపిల్లేమిటి?" చిలిపిగా అతడికేసి చూస్తూ అంది రాధ.

మగవాళ్ళపై ఎలా మత్తుమందు జల్లి, చిత్తు చేయాలో రాధకి అనుభవంతో బాగా తెలుసు.

చాలా తక్కువ సమయంలోనే ఆమె ప్రయోగించిన 'అస్త్రాల'కి లొంగిపోయాడు పరమోత్తమరావ్.

"గుడ్ గాడ్" ఆ గదిలో కొద్దిసేపటి వరకూ అలుముకున్న నిశ్శబ్దాన్ని తలుస్తూ, తనకౌగిట్లో వున్న రాధతో చెప్పాడు "సుఖానికి సరియైన నిర్వచనం నువ్వే!"

"నిజంగా—?" రాధ కంఠం మత్తుగా పలికింది. ముడతలు పడ్డ పరమోత్తమరావ్ మెడ చుట్టూ తన చేతులు వేసింది, "మీ ముచ్చట తీర్చాను కాబట్టి, నాకో చిన్న ముద్దు కోర్కె వుంది" గోముగా అంది రాధ.

"నీ ముద్దు చెల్లించడానికే కదా డియర్ నేనిక్కడున్నది?" ఏ వజ్రాల నెక్లెసో అయి వుంటుందని వూహించి, రాధ చెక్కిలి నిమురుతూ అన్నాడు పరమోత్తమరావ్.

చెప్పింది రాధ. ఆమె కోరికవిని నివ్వెరబోయాడు. "వాట్ డూ యూ మీన్?" ఆశ్చర్యంగా అడిగాడు.

రాధ చెబుతుంటే, మౌనంగా తల పంకించ సాగాడు పరమోత్తమరావ్.

## 4

"మిస్టర్ చిదంబరం! యూ ఆర్ ఎ గుడ్ 'బ్రోకర్'," ప్రత్యేకంగా చిదంబరాన్ని తన రూమ్‌లోకి పిలిపించి, అభినందించాడు పరమోత్తమరావ్.

"థాంక్స్ సార్!" అప్పుడే ప్రమోషన్ వచ్చినంతగా ఆనంద పడిపోయాడు చిదంబరం.

"నాకిచ్చిన ఆనందానికి నీకో చిన్న ప్రజంటేషన్! వచ్చేనెలనుంచి నీ హోదా పెరుగుతుంది. నీ చేతులు కొత్త పనిని అందుకొంటాయి.." పై వాక్యం వత్తి పలికాడు పరమోత్తమరావ్.

కాలు నేల మీద నిలవలేదు చిదంబరానికి. హుషారుగా యింటికివెళ్ళడానికి ఆ రూమ్ నుండి బయట పడ్డాడు చిదంబరం.

అతను రూమ్‌నుండి బయటకెళ్ళేంత వరకూ చూసాడు పరమోత్తమరావ్. అతడి చేతి వేళ్ళు వేగంగా కదిలి, సమీపంలోనే వున్న టెలిఫోన్‌ని డయల్ చేసాయి.

*　　*　　*

"రాధా! నా ఎస్టిమేషన్ కరక్ట య్యింది. నిన్ను మా బాస్ దగ్గరికి పంపించినందుకు నాకు ప్రతి ఫలం దక్కింది. చూసావా? నిన్ను చేసుకోవటం నాకెలా వుపయోగ పడ్డిందో?" యింట్లోకి వస్తూనే అన్నాడు చిదంబరం.

"అవును చిదంబరం! నిన్ను చేసుకోవటం నాకో కొత్త జీవిత సత్యాన్ని బోధించింది. కేవలం... కోర్కె తీర్చు కోవడానికి మమ్మల్ని తాత్కాలికంగా కొనే మనుషులే నాకు తెలుసు. కాని 'వేశ్యోద్ధారణ' పేరుతో పెళ్ళాడి, భార్య శరీరాన్ని స్వార్థానికి వుపయోగించుకొనే మగ వెధవని పరిచయం చేసావు" తీక్షణంగా చూస్తూ అంది రాధ.

కోపంతో మండి పడి, ఏదో అనబోయాడు చిదంబరం.

అతనికి అడ్డొచ్చింది రాధ "షటప్, మిస్టర్ బాస్టర్డ్! వళ్ళమ్ముకుని బ్రతకటానికి అయితే నీ దగ్గర బానిసలా పడి వుండి, నీ అవసరాలు తీర్చవలసిన అగత్యం నాకులేదు. మళ్ళీ నేను స్వేచ్ఛగా, ఎటువంటి అడ్డంకి లేకుండా నా పాత జీవితం లోకే వెళ్ళిపోతున్నాను. గుడ్‌బై!" ముందుకి కదలబోయి, ఒక క్షణమాగి, చెప్పింది రాధ. "నన్ను నీ స్వార్థానికి వుపయోగించుకున్నందుకు దారుణంగా 'పే' చెయ్యబోతున్నావు, సిద్ధంగావుండు" ఆ యింటినుండి బయటపడింది రాధ.

నివ్వెరపోయి, ఏదో తిట్టబోయాడు. కాని యింతలో తన యింట్లోకి 'వచ్చినవాళ్ళని' చూసేసరికి, నోరు పెగలలేదు చిదంబరానికి.

*　　*　　*

"నువ్వు చెప్పినట్లే చేసాను రాధా డియర్! చిదంబరానికి అయిదు వేలిచ్చి, ఆ మొత్తం మాయమైందని, చిదంబరంమీద అనుమానముందని పోలీస్ కంప్లైంట్ యిచ్చాను. ఇప్పుడుతీరిందా నీపగ?"

"థాంక్యూ డియర్! నా ముద్దు చెల్లించినందుకు" తన ఎర్రని పెదాలతో పరమోత్తమరావ్‌కి కృతజ్ఞతలు తెలియజేసింది రాధ.

సరిగ్గా ఈ సంఘటన జరిగిన నెల రోజులకి—

"ఏడు!" జైలు తలుపుకివున్న వూచలని లెక్క పెడుతూ గొణిగాడు చిదంబరం.

అదే సమయానికి—

వంటరిగా, హాయిగా తన 'పాత' మంచంమీద పడుకొని "అవును, ఏడూ! ఏడ్వరా! నీలాంటి వెధవలకి అంతేకావాలి" చిదంబరాన్ని తల్చుకొంటూ, అనుకొంది రాధ. *

